క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష బిళ్వార్చన



చేబ్రోలు: కార్తిక మాసం పురస్కరించుకొని చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష బిళ్వార్చన కార్యక్రమం ఘనంగా జరిగింది. దేవాదాయశాఖాధికారి పోతుల రామ కోటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అర్చకులు, రుత్విక్ స్వాములు లక్ష బిళ్వార్చన, వివిధ పూజలను స్వామివారికి నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష మారేడు దళాలలతో పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పాదయాత్రకు మద్దతు తెలపాలి

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో విజయదుందుభి మోగించి మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురామరాజు విజయనగరం జిల్లా నుంచి తిరుపతి శ్రీవేంకటేశ్వరుని సన్నిధికి 820 కిలోమీటర్లు పాదయాత్రగా వెళుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గురువారం గుంటూరు రూరల్ మండలం చౌడవరం గ్రామంలోని స్టేట్‌బ్యాంక్ వద్ద రాత్రి బసచేయనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 6:30 గంటలకు తిరిగి పాదయాత్రగా బయలుదేరనున్నారు. పత్తిపాడు నియోజవర్గంలో జరుగుతున్న పాదయాత్ర ప్రారంభానికి నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అనుబంధ విభాగాల నాయకులు, డైరెక్టర్లు, చైర్మన్‌లు పాల్గొని సంఘీభావం తెలపాలని ఈమేరకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రతి ఒక్కరూ ఈ సంఘీభావ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



పెదకాకాని: కార్తికమాసం పురస్కరించుకుని పెదకాకాని శివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆలయ ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. విజయవాడ ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఫౌండేషన్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో 286 మందికి ఉచితంగా పరీక్షలు చేసి వైద్య సేవలు అందించారు. ముఖ్యంగా ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాలు, సమస్యలపై విశేష అనుభవం కలిగిన స్పెషలిస్ట్ డాక్టర్లు ఎంజే నాయుడు, రవితేజ, సందీప్, వంశీకృష్ణలు వారి సాంకేతిక సహాయకులు, ఫిజియోథెరపిస్టుల బృందంతో వైద్యసేవలు అందించడంపై స్థానిక రోగులు, భక్తులు అభినందనలు తెలియజేశారు.

మేలైన సాగు పద్ధతుల 'పొలంబడి'



పెదకాకాని: వరిపంట గింజ పాలు పోసుకునే దశలో ఉన్నందున రైతులు పొలంలో ఉన్న నీటిని బయటకు తీసివేయాలని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి అన్నారు. వరి పైరు మేలైన సాగు పద్ధతులపై పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురువారం గోళ్లమూడి గ్రామంలో రైతులతో కలిసి వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ సంధ్యారాణి మాట్లాడుతూ వరి పొలంలో నీరు బయటకు తీయడం ద్వారా తుఫాన్ ప్రభావం వలన వర్షాలు పడినప్పటికీ పంటకు ఎటువంటి నష్టం ఉండదన్నారు. అధికంగా నీరు ఉన్న సమయంలో పంట నేలవాలితే మొలక రావడం, రంగుమారడం వంటి ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరిపంటకు ఎటువంటి రసాయన పురుగుమందులు, సుడిదోమ, కంకినల్లికి మందులు పిచికారీ చేయవలసిన అవసరం లేదన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్‌వీ శివాజీ, వీఏఏ విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. చంద్రమౌళీనగర్‌కు చెందిన ముప్పాళ్ల సాంబశివరావుకు, వల్లూరి వంశీకి మధ్య రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించి గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం చంద్రమౌళీనగర్ జీరో లైనులో వల్లూరి వంశీ, అతని అనుచరుడు కలసి ముప్పాళ్ల సాంబశివరావుపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో సంక్షేమ స్వర్ణయుగం

- పలు గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు
- సచివాలయాల్లో సంక్షేమ పథకాల బోర్డులు ఆవిష్కరణ
- ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి



కోయవారిపాలెంలో పథకాలను వివరిస్తున్న నాయకులు

పొన్నూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. గురువారం మండలంలోని కట్టెంపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వ అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అనంతరం గ్రామ సచివాలయంలో అభివృద్ధి సంక్షేమ పథకాల వివరాలతో ప్రదర్శించిన బోర్డును ఆవిష్కరించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి దాసరి శివరామకృష్ణ, నాయకులు సర్దార్, కిలారి శివప్రసాద్, వడాలశెట్టి శివనాగులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పొన్నూరు పట్టణంలో..

16,17 వార్డుల పరిధిలోని ఏడో సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. వార్డుల పరిధిలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల వివరాలతో ప్రదర్శించిన బోర్డును వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు మాట్లాడుతూ రాజకీయ ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ కే దక్కుతుందన్నారు. గత పాతికేళ్లలో పొన్నూరులో చూడని అభివృద్ధిని నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరు రంగారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్, జేసీఎస్ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు, జిల్లా కన్వీనర్ రమణ రెడ్డి, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): అర్హత ఉన్న ప్రతి ఇంటికీ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాయని ఎంపీపీ దాసరి అన్నమ్మ అన్నారు. మండల పరిధిలోని కోయవారిపాలెంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీపీ దాసరి అన్నమ్మ మాట్లాడుతూ జగనన్న అమ్మ ఒడి, రైతు భరోసా, డ్వాక్రా రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, పేదలందరికీ పక్కా ఇళ్లు.. వంటి ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్విరామంగా అమలు చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ వంద సంవత్సరాల తరువాత భూముల రీసర్వేను చేపట్టిన దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. అసైన్డ్ భూములు పొందిన రైతులు వాటిపై లావాదేవీలు జరుపుకొనేలా చట్టసవరణ చేసి నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి వారి కుటుంబాల్లో సీఎం వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో కొండేపాడు సర్పంచ్ నర్రా రాంబాబు, సచివాలయ కన్వీనర్లు వాసిమళ్ల రత్నబాబు, గండు నాగరాజు, పార్టీ నాయకులు దాసరి చెంచురామారావు, ప్రత్తిపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు గుజ్జుల శివారెడ్డి, కోయవారిపాలెం గృహ సారథులు ప్రసాద్, సన్ని, వెంకటేశ్వర్లు, అప్పారావు పార్టీ నాయకులు నాగయ్య, గురవయ్య, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో రూ. 22.95 కోట్ల సంక్షేమం..

కోయవారిపాలెంలో 22.95 కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందించిందని పల్లెకు పోదాం కార్యక్రమం నోడల్ ఆఫీసర్ మావులూరి మోషె తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద జరిగిన పల్లెకు పోదాం కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల ప్రదర్శన ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అర్హత ఉండీ లబ్ధిపొందని వారు ఉంటే సచివాలయంలో సంప్రదించాలన్నారు. ఏపీఎం సురేష్‌కుమార్, కొండేపాడు సర్పంచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం..

పెదకాకాని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగేందుకు జగనన్నను మళ్లీ సీఎంను చేసకుందామని జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి అన్నారు. మండల కేంద్రమైన పెదకాకాని రెండవ సచివాలయంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ (రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ సభ్యులు గోళ్ల జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిపాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ముందుగా పార్టీ జెండా ఎగురవేసిన నాయకులు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయ పరిధిలో ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష ప్రయోజనాల ద్వారా 4,69,45,945 రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎం.రాజారామ్, పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, పిల్లి శౌరిబాబు, జె.సాల్మన్‌రాజు, ఎస్‌కె షరీఫ్, ఎన్.యాకోబురాజు, డి.యోహాను, డి.అంజనేయులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

గుంటూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి పేర్కొన్నారు. గురువారం 40వ డివిజన్ పరిధిలోని జన్మభూమినగర్‌లో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో అర్బన్ క్లస్టర్ -2 కన్వీనర్ బండారు శ్రీనుతో కలిసి కార్పొరేటర్ సాంబిరెడ్డి పాల్గొన్నారు. వార్డు సచివాలయం పరిధిలో ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు రూ.20 కోట్లతో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్టికను ఆవిష్కరించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ చేశారు. ప్రజల ఇంటివద్దకు వెళ్ళి ప్రభుత్వం నుంచి వారికి అందిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా అభిప్రాయాన్ని సేకరించారు. ప్రజలంతా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని ముక్త కంఠంతో తెలిపారు. పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు సాంబశివరావు, 41వ డివిజన్ కార్పొరేటర్ స్మితపద్మజ, ఆర్అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, జేసీఎస్ కన్వీనర్ పిల్లి నాగేశ్వరరావు, కందుల వెంకటేశ్వరరెడ్డి, బాబురావు, ముత్యాల నాగరాజు, ముత్యాల శ్రీనివాసరావు, అనిల్, రాజు, బంగారయ్య, జానీ, జనార్థన్, సత్తిరాజు, ఉమా, కందుకూరి జ్యోతి, షేక్ బుజ్జి పాల్గొన్నారు.

గోరంట్లలో...

గోరంట్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్బన్ క్లస్టర్ కన్వీనర్ బండారు శ్రీను, డివిజన్ కన్వీనర్ జల్లేపల్లి వేణుబాబులు పాల్గొని సచివాలయం పరిధిలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల పట్టికను ప్రారంభించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ చేశారు. దుపాల రాధ, జంగా జయరాజు పాల్గొన్నారు.



పొన్నూరు సచివాలయంలో ..



కట్టెంపూడిలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ



40వ డివిజన్‌లో మాట్లాడుతున్న కార్పొరేటర్ సాంబిరెడ్డి

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలే లక్ష్యం..

వల్లూరు(కాకుమాను): గ్రామాలలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ వింతా రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని వల్లూరులో గురువారం రాత్రి ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలో వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా జనరంజక పాలన చేస్తున్నారని ఆయన తెలిపారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో లబ్ధిదారుల పట్టికను ఆవిష్కరించారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, గ్రామ మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తియ్యగూర వెంకటరెడ్డి, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు కొత్త అమేష్, కాకుమాను సొసైటీ అధ్యక్షుడు కోంద్రు అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ పంగులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా స్టాళ్లను సద్వినియోగం చేసుకోవాలి

పొన్నూరు శాసనసభ్యుడు
కిలారి వెంకట రోశయ్య



అప్పాపురం చానల్ వద్ద ఫిష్ ఆంధ్ర స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: ఫిష్ ఆంధ్రా స్టాల్స్‌ను సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు అబివృద్ధి సాధించాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో ఫిష్ ఆంధ్రా స్టాల్స్‌ను గురువారం పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. స్థానిక అప్పాపురం ఛానల్ వద్ద నలుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1.70లక్షల యూనిట్ విలువ కలిగిన ఫ్రిజ్, దుకాణం, పరికరాలను అందజేశారు. యూనిట్ విలువలో రూ.70వేలు సబ్సిడీ, రూ.లక్ష రుణం అందజేశారు. మొత్తం నలుగురు లబ్ధిదారులకు యూనిట్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి పారదర్శకంగా పరిపాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అప్పాపురం చానల్ కట్ట సమీపంలోని ఇరిగేషన్, ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఫిషరీస్ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకం

వీవీఐటీలో ఓటుహక్కుపై
అవగాహన సదస్సు



వీవీఐటీలో ఓటుహక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ పి.రత్నం

పెదకాకాని: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలక పాత్ర పోషిస్తుందని తహసీల్దార్ పెల్లూరి రత్నం అన్నారు. పెదకాకాని మండలంలోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని నేషనల్ సర్వీసు స్కీమ్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఓటు హక్కు నమోదు, ఓటు ప్రాధాన్యత అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.రత్నం మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు తప్పకుండా ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు విలువలను అందిరికీ తెలియపరచి ఓటు నమోదు చేయించుకునే విధంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ఓటర్ల నమోదు పక్రియ పారదర్శకంగా జరగాలి



చేబ్రోలులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి హరిహరనాథ్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ

చేబ్రోలు: ఓటర్ల నమోదు పక్రియ పారదర్శకంగా జరగాలని పొన్నూరు నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి హరిహరనాథ్ అన్నారు. చేబ్రోలు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఓటర్ల జాబితా ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిహరనాథ్ మాట్లాడుతూ బీఎల్ఓలు ఓటర్ల జాబితా ఆధారంగా ఇంటింటికి పునఃపరిశీలన చేయాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పూర్తిస్థాయిలో ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు. డిసెంబర్ 9వ తేదీలోగా పక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణలపై అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-శ్రమ కార్డులతో కార్మికులకు పలు ప్రయోజనాలు



మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శేఖర్

గుంటూరు ఈస్ట్: ఈ-శ్రమ కార్డులతో కార్మికులకు పలు ప్రయోజనాలున్నాయని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి.శేఖర్ తెలిపారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సౌజన్యంతో ఇండియా లేబర్ లైన్ ఆధ్వర్యంలో నల్లచెరువు లారీ స్టాండ్‌లో అసంఘటిత కార్మికులకు ప్రభుత్వ పథకాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శేఖర్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్డు ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వం రూ. 2 లక్షలు ప్రమాద బీమా చెల్లిస్తుందని చెప్పారు. రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రతి ఒక్క కార్మికుడు తప్పక ఈ-శ్రమ కార్డును కలిగి ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఇండియా లేబర్ లైన్ ప్రతినిధులు మాధవరావు, ఈశ్వరరావు, లారీ స్టాండ్ యూనియన్ నేతలు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 158 మందికి పరీక్షలు

గుంటూరు వెస్ట్: ఉద్యోగులు, వృద్ధుల కోసం స్థానిక కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమయ్యిందని ఏపీ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్. వెంకటేశ్వరరావు తెలిపారు. శిబిరంలో 158 మందికి దంత, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. దీని కోసం తమ కర్తవ్యంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ విజయచంద్ర, అసోసియేషన్ నాయకులు సుధాకర్‌బాబు, డి.కృష్ణమూర్తి, రామకృష్ణ పాల్గొన్నారు.

11న నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 11న నిర్వహించనున్నట్లు సెక్రటరీ సంపత్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో జరిగే సమావేశంలో అధికారులు, కార్పొరేటర్లు, సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

శక్తి ఉమెన్ ఐకాన్ అవార్డ్స్ లోగో ఆవిష్కరణ

పాత గుంటూరు: వివిధ రంగాల్లో వృత్తిపరంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు అవార్డులు ప్రదానం చేయడం అభినందనీయమని నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ షేక్ సజీల అన్నారు. శరవణ సంస్థ సహకారంతో ఎస్ఆర్ మీడియా ఆధ్వర్యంలో మార్చి ఒకటో తేదీన అమరావతిలో నిర్వహించనున్న శక్తి ఉమెన్ ఐకాన్ అవార్డ్స్ లోగోను గురువారం బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా డెప్యూటీ మేయర్ సజీల పాల్గొన్నారు. ఎస్ఆర్ మీడియా చైర్మన్ జి. రమేష్ యాదవ్ మాట్లాడుతూ రాజకీయ, వైద్య, విద్య, పోలీస్, మీడియా, సినిమా, క్రీడ, పారిశ్రామిక రంగాల్లో ప్రతి విభాగానికీ తొమ్మిది అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. వృత్తిపరంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శరవణ ఎండీ రవిచంద్ర, సీఈవో డి. శ్రీనాథ్, పి. దుర్గాభవాని, జి.లత పాల్గొన్నారు.

గొట్టిపాడు టీడీపీ పంచాయతీలో మళ్లీ ముసలం




నిరసన తెలుపుతున్న టీడీపీ ఉపసర్పంచ్ నిమ్మగడ్డ ముకుంద శివరంజని దంపతులు

గొట్టిపాడు (ప్రత్తిపాడు): గొట్టిపాడు టీడీపీ పంచాయతీలో మరోసారి నిధుల వినియోగం వ్యవహారం రోడ్డుకెక్కింది. గతంలో టీడీపీ సర్పంచ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ అదే పార్టీకి చెందిన ఉప సర్పంచ్ ముకుంద శివరంజని ఫిర్యాదు చేయడం, జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేయడం, దుర్వినియోగం నిజమని నిర్ధారించి సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా మూడు నెలల పాటు నిలిపివేయడం జరిగింది. ఈ నేపథ్యంలో కోర్టు సూచనల మేరకు సుమారు నెల కిందట సర్పంచ్‌కు చెక్ పవర్‌ను పునరుద్ధరించారు. అనంతరం కొద్ది రోజులకే పంచాయతీలో సుమారు రూ.10 లక్షల నిధులను రకరకాల అవసరాల నిమిత్తం డ్రా చేశారు. ఇదే విషయాన్ని గురువారం గ్రామంలో జరిగిన పంచాయతీ పాలకవర్గ సమావేశంలో చర్చించారు. నిధుల వినియోగంపై అభ్యంతరం తెలిపిన ఉప సర్పంచ్ శివరంజని, రూ.10లక్షల నిధులు ఎందుకు డ్రా చేశారని, నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులు, బిల్లులను చూపించాలని ఉప సర్పంచ్ శివరంజని డిమాండ్ చేశారు. స్పందించిన జూనియర్ అసిస్టెంట్ రికార్డులు పంచాయతీలో లేవని ఆడిటర్ దగ్గర ఉన్నాయని తెలిపారు.

మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన..

పంచాయతీలో రికార్డులు లేకపోవడంతో టీడీపీ ఉపసర్పంచ్ దంపతులు ప్రత్తిపాడులో ఎంపీడీఓ శ్రీరమ్య, ఈఓపీఆర్డీ మోషెలను కలిసి సమస్యను వివరించారు. గ్రామ పంచాయతీలో మరోసారి నిధులు పెద్ద మొత్తంలో దుర్వినియోగమయ్యాయని, రికార్డులు అడిగితే ఆడిటర్ దగ్గర ఉన్నాయి, డీఎల్‌పీఓ దగ్గర ఉన్నాయని చెబుతున్నారని, వారికి ఫోన్లు చేసి అడిగితే మా వద్ద లేవంటున్నారని, మా పంచాయతీ రికార్డులు ఎక్కడ ఉన్నాయో తెప్పించాలని కోరారు. ఈఓపీఆర్డీ నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో రికార్డులు తెప్పించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉపసర్పంచి దంపతులు బైఠాయించి నిరసన తెలిపారు. స్పందించిన ఎంపీడీఓ శ్రీరమ్య విషయాన్ని డీపీఓ శ్రీదేవి దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె ప్రత్తిపాడుకు వచ్చి ఉపసర్పంచ్ దంపతులతో మాట్లాడారు. రికార్డులు సీజ్ చేసి తెప్పిస్తానని, పూర్తి విచారణ చేసి వారం రోజుల్లో బాధ్యులపై చర్యలు తీసుకుంటానని స్పష్టమైన హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

బోధన నైపుణ్యాల్ని మెరుగు పరచుకోవాలి



మాట్లాడుతున్న గుంటూరు డీవైఈఓ వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాల్ని అభివృద్ధి పరచుకోవాలని గుంటూరు డీవైఈఓ పి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్ని గుంటూరులోని పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాల్ని గురువారం సందర్శించిన డీవైఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బోధనలో కాలానుగుణంగా ఆధునిక పద్ధతుల్ని ప్రవేశపెడుతున్న ప్రభుత్వం, ఉపాధ్యాయులకు నిరంతరం శిక్షణ కార్యక్రమాల్ని నిర్వహిస్తోందని చెప్పారు. అత్యుత్తమ మెటీరియల్‌తో పాటు బోధనలో నిపుణులైన ఉపాధ్యాయులను రిసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేసి అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వేశ్వర స్వామి కల్యాణం

పాత గుంటూరు: బ్రాడీపేటలోని శ్రీ గౌరీ విశ్వేశ్వరస్వామి జన్మనక్షత్రం సందర్భంగా గురువారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తుల్ని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉభయ దాతలుగా దంపతులు దండిభట్ల కృష్ణ కిశోర్, జయశ్రీ, త్రిపురమల్ల వెంకటేశ్వర్లు, నిర్మల, పొన్నలూరి సీతారామాంజనేయులు పాల్గొన్నారు.